క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ రంగ్రీజు పేట, చందా సత్రం, గుండు వారి వీధి, సదనం పాఠశాల వీధి, నూనె కొట్లుల సందు, శంకర మఠం, వంకాయల వారి వీధి, రాళ్లపల్లివారి వీధి, దాసరివారి వీధి, పెట్రోల్ బంక్, గోదావరి గట్టు ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ హుకుంపేటలోని కార్తికేయ నగర్, వరలక్ష్మి కాలనీ, డీఎస్ఆర్ నగర్, వెంకటగిరి, గణేష్ నగర్, రామకృష్ణ నగర్, సావిత్రీ నగర్, చైతన్య నగర్, వెలుమూరి విస్తాస్, డీ మార్ట్ ఏరియా, ఎంపీడీవో కార్యాలయం, మూడు గుడుల ఏరియా, నాగిరెడ్డి నగర్, హుకుంపేటలో అంతరాయం కలుగుతుందన్నారు.

సాంకేతిక విద్యలో నైపుణ్యం సంపాదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ శర్మ

సీటీఆర్ఐ: సాంకేతికంగా విద్యలో నైపుణ్యం ప్రదర్శించినప్పుడే భవిష్యత్తులో విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మేడూరి శ్రీధర్ శర్మ అన్నారు. ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ స్కిల్స్ డెవలప్‌మెంట్, ఎంప్లాయబిలిటీ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా ఆయన ఉపన్యాసం చేశారు. నేటి అవసరాల దృష్ట్యా ప్రతి విద్యార్థి నైపుణ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాలపై దృష్టి పెట్టినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యకో–ఆర్డినేటర్ డాక్టర్ వై.స్వర్ణ శ్రీ,, సీఎస్డీఈపీ డైరెక్టర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశ్ నగర్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అడిషనల్ ఎస్పీ ఎం.మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ చెంచురెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో భారత రైజింగ్ ఫౌండేషన్ జైకిషన్ ఆధ్వర్యంలో మంగళవారం మాస్టర్స్ కప్ టోర్నీ 40 ఏళ్ల కేటగిరీ విభాగంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వారితోపాటు వై.శ్రీనివాస్, చల్లా మురళీ ముఖ్యఅతిథులుగా హాజరై ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శారీరక, మానసిక ధృడత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. నాలుగు పదుల వయసులో క్రికెట్ ఆడటానికి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు జై కిషన్, మిధున్ వర్మ, మూర్తి చౌదరి, పిల్లి శ్యాం గంగరాజు, కాలేపు సత్య సాయిరాం, కళ్యాణ్, నాగార్జున పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంపై అవగాహన



విద్యార్థులకు భౌతికశాస్త్రంపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కడియం: రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వేమగిరి హైస్కూలు విద్యార్థులకు భౌతికశాస్త్రంపై విస్తృత అవగాహన కల్పించారు. ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులతో పలు ప్రయోగాలు చేయించారు. యాంత్రిక తరంగాల ప్రదర్శన, సౌరశక్తి ప్రయోగాలు, విద్యుత్ డైనమో సాయంతో యాంత్రిక శక్తిని విద్యుత్‌శక్తిగా మార్చడం తదితర ప్రయోగాలను వివివరించారు.

కండక్టర్‌కు తప్పిన ప్రాణాపాయం

కంబాలచెరువు: ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంతో ఆ బస్సులో కండక్టర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం డిపోకు చెందిన బస్సు పురుషోత్తపట్నం నుంచి రాజమహేంద్రవరం వస్తోంది. నగర శివారుకి వచ్చేసరికి కండక్టర్ గణేష్‌కు గుండెలో అసౌకర్యంగా ఉండి, శరీరమంతా చెమటలు పట్టేశాయి. దీన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే ప్రయాణికులను గోకవరం బస్టాండ్ వద్ద దింపేశాడు. బస్సును నేరుగా ప్రభుత్వాసుపత్రికి పోనిచ్చి కండక్టర్‌కు వైద్య చికిత్సలు అందేలా వైద్యులను అప్రమత్తం చేశాడు. దీంతో కండక్టర్‌కు ప్రాణాపాయం తప్పింది.

తాగునీటి పథకంపై నిర్లక్ష్యం

- పైపులైన్లకు తరచూ లీకేజీలు
- సక్రమంగా సరఫరా కాని నీరు



బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద లీకేజీ అయిన పైపులైన్



హుకుంపేట చెరుకూరి గోడౌన్స్ వద్ద లీకేజీ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు రూ.20 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్లక్ష్యానికి గురవుతోంది. తరచూ ప్రధాన పైపులైన్లతో పాటు ఇతర పైపులైన్లకు లీకేజీలు ఏర్పడడంతో సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు ఇవీ..

దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అప్పటి కడియం నియోజకవర్గంలోని కడియం, రూరల్, రాజానగరం మండలాల్లోని గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించాలని నిర్ణయించారు. సుమారు రూ.22 కోట్లతో 2007లో బొమ్మూరు వెంకటగిరి కొండపై సమగ్ర రక్షిత మంచినీటి పథకం 220 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాన్ని 2010లో ప్రారంభించి ఆయా మండలాలకు సురక్షిత తాగునీరు అందించారు. అయితే ఆ వాటర్ ప్లాంట్ ప్రారంభించి సుమారు 15 ఏళ్లు కావడంతో పైపులైన్లు మరమ్మతుకు గురై లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

తరచూ లీకేజీలు

హుకుంపేటలోని చెరుకూరి గోడౌన్ల వద్ద ఆరు నెలల క్రితం ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి హుకుంపేట తదితర ప్రాంత ప్రజలకు నెల రోజులకు పైగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వాటర్ ప్లాంట్‌కు ధవళేశ్వరం గోదావరి నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ ఎర్రకొండ వద్ద లీకేజీ అయ్యింది. దీంతో పది రోజుల పాటు మూడు మండలాలకు గోదావరి సురక్షిత తాగునీరు నిలిచిపోయింది. కడియం, రూరల్, రాజానగరం మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామ ప్రజలకు వాడకానికి అక్కడ బోర్లు ద్వారా నీటి సరఫరా చేస్తారు. గోదావరి నీరు వచ్చే సమయంలో ప్రజలు తాగేందుకు పంచాయతీ సిబ్బంది నీటిని విడుదల చేస్తారు. పంచాయతీ నీరు, గోదావరి నీరు పుష్కలంగా వస్తే ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండదు. ఒక వేళ గోదావరి నీరు నిలిచిపోతే ప్రజలకు సమస్య ఏర్పడుతుంది.



ధవళేశ్వరం ఎర్రకొండ వద్ద ప్రధాన పైపులైన్‌కు లీకేజీ (ఫైల్)

నీటి ఇబ్బందులు

గోదావరి సురక్షిత తాగునీరు లేకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. అదే పైపులైను గత నెలలో లీకేజీ అయ్యి ఐదు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మళ్లీ సోమవారం అర్ధరాత్రి ఆ పథకం నుంచి రాజవోలు వైపు వెళ్లే బొమ్మూరు 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోయింది. దీంతో సంబంధిత సిబ్బంది సదరు లీకేజీకి మరమ్మతులు చేపడుతున్నారు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక చోట లీకేజీలు కావడంతో సురక్షిత మంచినీటి పథకం లక్ష్యం పక్క దారి పడుతోంది. ఇప్పటి కైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తరచూ లీకేజీలు



సమగ్ర సురక్షిత తాగునీటి పథకం పైపులైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు సార్లు, ఇప్పుడు మళ్లీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాత పైపులైన్ స్థానంలో కొత్తవి వేసి, ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

– బత్తిన అప్పారావు, శాటిలైట్ సిటీ

ఖైదీల కేసుల దర్యాప్తుపై సమావేశం



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత కోర్టు ఆవరణలో మంగళవారం అండర్ ట్రైల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, ఛార్జ్‌షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఖైదీలు జామీను విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ మీటింగ్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాచరణ, బాధితుల పరిహారాల కేసులపై సునీత చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మీ, అడిషనల్ ఎస్పీలు ఏవీ.సుబ్బరాజు, ఎన్‌బీకే.మురళీకృష్ణ, కాకినాడ పోలీసు అధికారి మనీష్‌దేవ్ పటేల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎస్పీ సాయిప్రశాంత్, జీపీ సురేందర్ ప్రసాద్, జిల్లా కోర్టు పీపీ రాధాకృష్ణంరాజు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, మహిళా జైలు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

సీటీఆర్ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వెలిడేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా నష్టపోతారన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా 8వ పేకమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో ఓ సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. నిరసనలో నగర యూనిట్ అధ్యక్షుడు కేకే సంజీవరావు, సహాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే నాయకుడు శ్రీరామ్మూర్తికి పరామర్శ



శ్రీరామ్మూర్తిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తిని పలువురు పరామర్శించారు. ఆయన పెద్ద కుమార్తె సత్తి తేజస్విని (29) సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె అంత్యక్రియలను మంగళవారం ఇన్నీసుపేట రోటరీ కైలాస భూమిలో నిర్వహించారు. ముందుగా పార్థివ దేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు సోమసుందర్, స్వాతి ప్రసాద్, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి పార్థసారథి, సీసీసీ చానల్ఎండీ పంతం కొండలరావు, వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు.

అసంక్రమిత వ్యాధుల సర్వే పరిశీలన



సర్వే వివరాలను పరిశీలిస్తున్న బృందం

కడియం: అసంక్రమిత వ్యాధులపై పీహెచ్‌సీ స్థాయిలో జరిగిన సర్వేను వేమగిరిలో మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా.బి.శ్రీనివాస నాయక్ బృందం పరిశీలించింది. మండలంలోని వేమగిరి–3 సచివాలయం పరిధిలో జరిగిన ఈ సర్వే క్వాలిటీ అసెస్‌మెంట్‌లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా అసంక్రమిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 5 గ్రామాల్లో ఈ సర్వే నాణ్యత పరిశీలన జరుగుతుందన్నారు. తమ బృందంలో మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డా.వీవీ.దుర్గాప్రసాద్, డా.కేవీ.ఫనిమాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.సూర్యారావు, డా.సురేంద్రబాబు, డా.దీప్తి, డా. ప్రశాంత్‌కుమార్, సీనియర్ రెసిడెంట్స్, ట్యూటర్లు ఉంటారన్నారు. ఈ బృందం పీహెచ్‌సీ స్థాయిలో చేసిన సర్వే నాణ్యతను గురించి పరిశీలించి ప్రభుత్వానికి నివేదక ఇస్తుందన్నారు. వారి వెంట కడియం ప్రభుత్వాసుపత్రి వైద్య బృందం ఉన్నారు.

పుస్తక పఠనంతో లక్ష్య సాధన



విద్యార్థులకు సూచనలిస్తున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు పుస్తకాలను విరివిగా చదవడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని ఆర్ట్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, కెరీర్ గైడెన్స్ నిపుణులు శ్రీనివాసరావు అన్నారు. బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం ఎమ్.నరసింహారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృక్షంలా ఎదగాలని, నిపుణుల సాయాన్ని అందిపుచ్చుకుని పైపైకి దూసుకుపోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి అవసరమైనప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. మంచి మాటలు వినడం, మంచి పుస్తకాలను చదవడం ద్వారా ఎంపిక చేసుకున్న రంగంలో రాణించగలరన్నారు. దయచేసి సెల్‌ఫోన్ కోరల్లో చిక్కుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కెరీర్ గైడెన్స్ నిపుణుడు డాక్టర్ బి.నర్సారెడ్డి మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా చదువును నిర్లక్ష్యం చేయవద్దన్నారు. హైస్కూల్ స్థాయి నుంచే మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ యు.శ్రీరామ్మూర్తి, ట్రస్ట్ అసిస్టెంట్ సెక్రటరీ ఎంవీఆర్ఎస్ శాస్త్రి, అడ్వైజర్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలి



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న డీఈఓ

రాజానగరం: పాఠశాలలో పిల్లలకు మూడో తరగతి చివరి నాటికి చదవడం, రాయడంతోపాటు సంఖ్యలతో పరిజ్ఞానాన్ని సాధించేలా వారిలో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్కూల్ లీడర్షిప్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు మండలంలోని మల్లంపూడి, సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను వృద్ధి చేయడంతోపాటు, విద్యార్థుల సంఖ్యను కూడా పెంపొందించే దిశగా ప్రయత్నించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి పెట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 176 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. తొమ్మిది మంది డీఆర్పీలుగా వ్యవహారిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్రావు, అనపర్తి ఎంఈఓ సత్తిరెడ్డి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పథకాలతో రైతులకు మేలు

- ప్రభుత్వాల ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి
- మండల ఉద్యానశాఖ అధికారి నాగ దేవిశ్రీ



రంగంపేట మండలంలో ఆయిల్ పామ్ తోటలో అంతర పంటల సాగు



అల్లం నాగదేవిశ్రీ

రంగంపేట: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన పలు పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి అల్లం నాగ దేవిశ్రీ కోరారు. ఆమె మంగళవారం విలేకరులకు పలు విషయాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ (ఎన్ఎమ్ఈఓ–ఓపీ) అనే కార్యక్రమాన్ని రూపొందించింది. ఆయల్ పామ్ సాగు చేసేందుకు ఒక హెక్టారుకు 143 మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్కకు రూ.193 ఖర్చు అవుతుంది. దీనికి ప్రభుత్వం నూరు శాతం రాయితీ అందిస్తుంది.

త్రికోణ పద్ధతిలో..

ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి మొక్కకు మొక్కకు మధ్య దూరం 9 మీటర్ల ఉండేలా త్రికోణ పద్ధతిలో నాటుకోవాలన్నారు. ఈ తోటలు ఫలదీకరణం చెందడానికి నాలుగేళ్లు పడుతుంది. ఈ నాలుగు సంవత్సరాలలో ఆయిల్ పామ్ మొక్కల మధ్య మొక్కజొన్న, మినుము, బొప్పాయి, అరటి, కూరగాయలు అంతర పంటలుగా పండించుకోవచ్చు. ఇలా అంతర పంటలు వేసినందుకు కూడా హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేల రాయితీ లభిస్తుంది. అంతర పంటలతో పాటు ఎరువులు, పురుగు మందులకు హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు అందిస్తారు. కోకోనట్ అభివృద్ధి బోర్డు (సీడీబీ) ద్వారా కొబ్బరి వేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తుంది.

రాయితీలు ఇలా..

మిషన్ ఆన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) ద్వారా పండ్ల తోటలైన మామిడి, జీడి మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ, టిష్యూ కల్చర్‌లో అరటి, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరిలో కోకో, ఆయిల్ పామ్‌లో కోకోకు సంబంధించి రైతు 5 ఎకరాల వరకు, పూల తోటలైన బంతి, గులాబీ, చామంతి, లిల్లీ, మల్లి తోటల రైతులు 2.5 ఎకరాల వరకు రాయితీలు పొందవచ్చు. చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా పండ్లు, పూల తోటల విస్తరణకు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ద్వారా డ్రిప్ వేసుకున్న చిన్న, సన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి 5 ఎకరాల లోపు నూరు శాతం రాయితీ అందిస్తుంది.

టీచర్లకు అందని జీతాలు



డీటీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కంబాలచెరువు: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు రీ–అపోర్షన్‌మెంట్ కారణంగా ఈనెల జీతాలు అందలేదని ఏపీటీఎఫ్ తెలిపింది. రాష్ట్ర డీటీఏ ఆఫీసు నుంచి పొజిషన్ ఐడీలు రాగానే ఉపాధ్యాయుల జీతాలు త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఖజానాధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. దీనిపై డీటీవో స్పందిస్తూ రాష్ట్ర ఖజానా శాఖ నుంచి పొజిషన్ ఐడీలు రాగానే వారి ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.అప్పయ్యశాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులు ముగ్గురికి కారుణ్య నియామకాల పత్రాలను జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గురిలో ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా కారుణ్య నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కార్యాలయ మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

రాజమహేంద్రవరం రూరల్: ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 30 శాతం నుంచి 67 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలు ఇస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. లాలాచెరువు ఆప్కో విక్రయ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆప్కో మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల్లో ఒకటైన చేనేత వస్త్రాలను తయారు చేయడం ద్వారా అనేక మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. చేనేత వస్త్రాలు శరీరానికి హాయిని కలిగించడమే కాకుండా ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం వస్త్రాలను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన చేనేత బ్రాండింగ్ కోసం ప్రామాణికతను నిర్ధారించుకొని, ఉత్పత్తి చేతితో నేసినదేనా, ఇతర ప్రమాణాలకు అనుగుణంగా ఉందా అని ప్రభుత్వం ధ్రువీకరించిన తర్వాతే మార్కెట్లోకి విక్రయాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.హరి ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

11 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: కాతేరు లశివారులో 11 కేజీల గంజాయిని మూడో పట్టణ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురు వ్యక్తులు, ఒక మహిళను అరెస్టు చేసి జైలుకు పంపారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతంలో కాపు కాశారు. ఆ సమయంలో గంజాయిని తరలిస్తున్న రాజమహేంద్రవరం, ఏలేశ్వరం ప్రాంతాలకు చెందిన పి.దుర్గబాబు, నక్కిరెడ్డి యాదవేంద్ర నాగ లోకేశ్, అలీద్ బాషా, కాపా చంటి, వినోద్ రామ్, షేక్ బేగంలను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చి, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సెంట్రల్ జైలుకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. మల్లయ్యపేటలోని ఇండస్ట్రియల్ కాలనీకి చెందిన బూమల గంగరాజు పేపర్ మిల్లులో ఉద్యోగం చేసేవాడు. గత నెల 30న ఉద్యోగ విరమణ చేశాడు. అనంతరం భార్యతో కలసి తిరుపతి వెళ్లి ఈ నెల 14న తిరిగి వచ్చాడు. మర్నాడు ఉదయం లేచి చూసేసరికి గంగరాజు ఇంటిలో లేడు. దీంతో అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.